www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023

సగానికి పైగా పాత బస్సులే..

- కాలం చెల్లిన బస్సులతో కాలక్షేపం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు..
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

దారి మధ్యలోనే ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. బస్సు ఎక్కి టికెట్ తీసుకుని బయలుదేరిన తరువాత సమయానికి గమన్యస్థానానికి చేరుతామో లేదో తెలీని పరిస్థితి. కండీషన్‌లో లేని ఆర్టీస్టీ బస్సులను రూట్‌లో నడపడం వలన అవి ఎక్కడ.. ఎప్పుడు.. ఎలా ఆగిపోతాయో అన్న అమోమయంతోనే ప్రయాణించాల్సిన దుస్థితి. సగానికి పైగా పాత బస్సులే ఉండటంతో ప్రయాణికులు వేరే గత్యంతరం లేక అవే ఎక్కి ప్రయాణిస్తున్నారు. రోజు ఈ బస్సుల్లో వెళ్లే విద్యార్థులు, ఉపాధి కోసం వెళ్లే కూలీలు సమయానికి చేరుకుంటామా లేదా అన్న సందేహంతోనే గమ్యస్థానానికి వరకు ప్రయాణించాల్సి వస్తోంది.

తిరుపతి నుంచి పచ్చికాపల్లం, కార్వేటి నగరం మీదుగా పక్క రాష్ట్రమైన పళ్ళుపట్టుకు తిరుపతి డిపో వారు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడుపుతున్నారు. ఈ రూట్‌లో కండీషన్‌లో లేని బస్సులను ఎక్కువగా తిప్పుతున్నారన్నదని అందరికీ తెలిసిన సత్యమే. అంతేకాకుండా ఈ మార్గంలో నడిపే బస్సుల ద్వారానే ఆర్టీసీకి ఎక్కువ ఆదాయం కూడా వస్తోంది. ఈ రూట్‌లో రోజుకు వందల సంఖ్యలో భక్తులు తిరుమలకు, తిరుపతికి జీవన ఉపాధి కోసం వెళ్లే వారు, స్కూల్, కాలేజీ విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూనే ఉంటారు. ఈ క్రమంలో పళ్ళిపట్టు నుంచి బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరింది. కార్వేటినగరం చిన్నకనుమపైకి రాగానే మరమ్మతులతో ఆగిపోయింది. దీంతో అందులో ప్రయానిస్తున్న ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానం చేరలేక, తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది ప్రయాణికులు ప్రైవేటు ఆటోలను ఆశ్రయించారు. మరి కొంతమంది మరో బస్సు వచ్చేంత వరకు వేచి ఉండి వెళ్లారు. సరైన కండిషన్ ఉన్న బస్సులను ఈరూట్లో నడపాలని పదేపదే ఆర్టీసీ అధికారులకు స్థానిక ప్రజలు చెబుతున్న మొరపెట్టుకున్న వారు స్పందించలేదని ఆరోపణలున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రూట్లో కండిషన్ ఉన్న బస్సులో నడపాలని ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పల్లె ప్రగతి

- నీరశిస్తున్న గ్రామీణం
- మౌలిక వసతులకు నిధుల కొరత
- నిధులు లేక ఖాతాలు ఖాళీ..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

గ్రామ పంచాయతీల అభివృద్ధి దేవుడు ఎరుగు.... కనీస మౌలిక వసతుల కల్పనకు గ్రామసర్పంచ్‌లు నిధులు లేక తలలు పట్టుకుంటున్నారు. కేంద్ర ఇచ్చే నిధుల సైతం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో దిక్కుతోచని స్థితిలో తమను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక ముఖం దాచుకోవాల్సిన పరిస్థితి ఉందంటూ సర్పంచ్‌లు కేంద్ర ప్రభుత్వం మంజూరు 15వ ఆర్థిక సంఘం నిధుల్విలంటూ కోర్టులు, ఆందోళనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వానికి కనికరం లేదాయే... ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, చిన్న పాటిరోడ్లు మరమ్మతులు కూడా చేయలేని స్థితి గ్రామీణం నీరశిస్తోంది.

తుపాను ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో అంటు వ్యాధిలు ప్రభలే అవకాశాలు ఎక్కువ .... ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు, అంటు వ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్ చల్లెందుకు నిధులు లేక కొందరు సర్పంచ్‌లు తమ సొంత డబ్బులు ఖర్చు చేస్తుంటే మరికొందరైతే తమ వల్లకాదంటూ చేతులెత్తేస్తున్నారు. ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులు, డ్రైనేజి ఇతర ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. చేసిన పనులకు జూలై నుండీ బిల్లులు రాకపోవడమే కారణంగా చెబుతున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక వడ్డీలు కట్టుకోవాల్సి వస్తోందంటున్నారు. మరో వైపు గ్రామ పంచాయల్లో పారిశుధ్య పనులు నిర్వహించే గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడీ జీతాలు చెల్లించలేని పరిస్థితి.

గ్రామ పంచాయతీల్లో కాలువల్లో మరుగు తీయాలన్నా, పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాన్నా చెత్తను శుభ్రం చేయాలన్నా ఖాతాల్లో డబ్బులు లేక మౌలిక వసతులను కూడా కల్పించలేని స్థితి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. ఇక వీధి దీపాలు మరమ్మతు చేయించకపోవడంతో చీకటిలోనే పల్లెవాసులు మగ్గుతున్నారు. వర్షకాలంలో మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడానికి నిధులు లేకపోవడంతో అలాగే వదిలేస్తున్నారు. దీంతో మురుగు నిల్వ చేరి ఆనీటిలో దోమలు వృద్ధిచెంది గ్రామీణులు రోగాల భారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు పాకింగ్ చేసే పరిస్థితిలేదు.

15వ ఆర్థిక సంఘం నిధులు చిత్తూరు జిల్లాకు రూ.46,48, 693 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరుతో కొంత జమ చేసుకోకాగా మిగిలిన సొమ్ము కూడా పంచాయతీల ఖాతాల్లో జమ చేయకుండా దారి మళ్లించింది. జిల్లాలో చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 697 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 36,7,659 ఆవాసాలున్నాయి. జనాభా విషయానికి వస్తే జిల్లాలో 15,14,050 మంది ఉన్నారు. ఇంత పెద్దసంఖ్యలో గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు కనీస మౌళిక వసతులకు నోచుకోవడం లేదు. వీధిలైట్లు, డ్రైనేజీలు, రోడ్లు మరమ్మతులు, తాగునీరు. ఓవర్‌హెడ్ ట్యాంకులు క్లీనింగ్ వంటి పనులు చేపట్టకపోవడంతో పల్లెప్రగతి పడకేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసి, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు తొడ్పాటును అందించాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు, గ్రామీణ వాసులు కోరుతున్నారు.

ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఓటు నమోదుపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పివికెయన్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటు హక్కు నమోదు, ఆవశ్యకత అంశాలపై ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ మార్గనిర్దేశంలో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, కళాశాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుస్థాయిలో వార్డుసభల ద్వారా, కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సంబంధిత సూపర్వైజర్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గురువారం పివికేఎన్ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వ పోటీలను నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఓటు ఎందుకు నమోదు చేసుకోవాలి? ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఆవశ్యకత? తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. వార్డు సభల్లో ఓటుహక్కు నమోదు, సవరణల అంశాల పైన స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇలాగేనా.. అవగాహన కల్పించేది..?

ఈవీఎం, వివి ప్యాడ్‌లపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- సోమల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచన మేరకు ప్రజలకు ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో తెలియజేయడం కోసం ఈవీఎం, వివి ప్యాట్ల నందు ఓటింగ్ ఎలా వేయాలో అవగాహన కల్పించాల్సిన రెవెన్యూ శాఖ మొక్కుబడిగా అవగాహన కల్పించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో, మండల కేంద్రమైన సోమల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఈవిఎం, వివి ప్యాట్లలో ఓటింగ్ ఎలా వేయాలి? ఓటు వేసిన తర్వాత తాము ఎవరికి ఓటు వేసామో అందులో ఎలా తెలుస్తాదన్న విషయాన్ని ఓటర్లకు, ప్రజా ప్రతినిధులకు, ప్రతిపక్ష పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. అవగాహన గురించి ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రజలు, ఓటు హక్కు కలిగిన వారు చాలా తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. మొక్కుబడిగా సాగిన అవగాహన కార్యక్రమంపై పలువురు ఇలాగేనా ఈవీఎం, వివి ప్యాట్లపై అవగాహన కల్పించే విధానం అంటూ విమర్శలు వెళ్ళువెతుతున్నాయి. దీనిపై వివరణ కోరెందుకు డిటి రామమూర్తిని చరవాణి ద్వారా అడుగగా డిఎల్‌ఓలు వీఆర్వోలకు సమాచారం ఇచ్చామని వారు ప్రజలకు తెలియజేసి పోలింగ్ కేంద్రాల వద్దకు రమ్మని తెలిపినట్టు తెలిపారు. వీఆర్వోలు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

పంటనష్టాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు

తుపానుకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- సోమల: మిచౌంగ్ తుపాను వల్ల అధిక వర్షాలు కురిసి పంట నష్టం జరిగిన రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటించి, జరిగిన నష్టాన్ని తగ్గించుకోవాలని ఏరువాక కేంద్రం చిత్తూరు శాస్త్రవేత్త, సమన్వయకర్త రెడ్డిరాము రైతులను కోరారు. గురువారం మండలంలో తుపాను వల్ల నష్టపోయిన రైతుల వ్యవసాయ పొలాలను మండల వ్యవసాయ సిబ్బందితో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేశారు. రైతులతో మాట్లాడి వారికి పలు సూచనలను అందజేశారు. సోమల దిడ్డివారిపల్లి, ఆవులపల్లి, నంజంపేట గ్రామాల పరిధిలో వరి పైరుకు జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి నివేదికలను సిద్ధం చేసి రైతులకు పలు సూచనలను అందజేశారు. నీటిలో మునిగిన వరి పొలాల్లో నీటిని కాలువలు తీసి బయటకు పంపించాలని, గింజ గట్టిపడే దశ, కోత దశలో ఉన్న వరి పొలాలు, నేలమీద ఒరిగిన వరిపంట పొలాలలో నీరు తీసి వేసుకుని, గింజలు మొలకలు రాకుండా ఉండడానికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పిచికారీ చేసుకోవడానికి వీలు కాకపోతే ఎకరాకు 25కేజీల రాళ్ల ఉప్పును పొలంపై వెదజల్లుకోవడం వలన గింజలు మొలక వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చునని, కళ్ళాల మీద ఉన్న ధాన్యం రంగుమారే అవకాశం ఉంటుంది, కాబట్టి నష్టాన్ని నివారించుకునేందుకు ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పును కలుపుకోవడం వలన గింజ మొలకెత్తకుండా నివారించుకోవచ్చునని, ఎండ వచ్చిన వెంటనే ఎండబెట్టి తూర్పార పట్టుకోవలెనని సూచించారు. ఏవో సుధాకర్ మాట్లాడుతూ ప్రతి రైతు శాస్త్రవేత్తలు సూచించిన జాగ్రత్తలు పాటించి, తుపాన్ వల్ల దెబ్బతిన్న వరి పంటలో నష్టాన్ని తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు, మోహన్ రెడ్డి, విశ్వనాథ్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మునిజ్యోతి, వనజ, రాధిక, సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష వద్దు

భవిత కేంద్రంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష చూపడం నేరమని, వారికి అండగా నిలిచి ఆదరించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. జగనన్న వికలాంగుల విద్యార్థులను గుర్తుపెట్టుకుని అన్ని రంగాలలో వాళ్ళు కూడా రాణించాలని రూ.25వేలు విలువ చేసే లాప్‌టాప్‌లను అందించారని తెలియజేశారు. అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని భవిత సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ లతాబాలాజీ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం భవిత కేంద్రంలో అందించే ఫిజియో థెరఫీని సద్వినియోగం చేసుకుని వికలతత్వానికి చెక్ పెట్టాలన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులను తల్లిదండ్రులు భారంగా భావించకూడదని, వారికి ఇష్టమైన రంగాన్ని గుర్తించి ప్రోత్సాహిస్తే వారు మహోన్నత వ్యక్తులుగా మారగలరలని చెప్పారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రత్యేక వైద్యసౌకర్యాలు కల్పించి వారిలో దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు భవిత కేంద్రాల్లో ప్రత్యేకమైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ భవిత విద్యార్థుల సౌకర్యం కోసం భవిత కేంద్రానికి ర్యాంపు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు నాగభూణమ్మ, కిరణ్ కుమార్, ఎఈ నాగభూషణంతో పాటు అనేక మంది ఆర్థిక సహాయాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఎంపీడీవో మోహన్ మురళీ, ఆర్కేఎస్సార్ హెచ్‌ఎం కోటేశ్వర్రావు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవీ, సహిత ఉపాధ్యాయులు సింధూజ, రేఖ, ఉపాధ్యాయులు ధనంజయులు, సీఆర్పీలు పలువురు పాల్గొన్నారు.

యువత సైన్యంలో చేరాలి: కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని యువతకు జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సచివాలయంలో త్రిసాయుధ దళాల పతాకదినోత్సవం సందర్భంగా సాయుధ దళాల అధికారుల నుంచి గౌరవవందనం స్వీకరించి విరాళం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశసేవలో విశిష్ట సేవలందించి వారి ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత సైన్యంలో మాతభూమికై విశిష్టసేవలను అందిస్తూ తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవానులను, త్రిసాయుద దళాలలో ప్రస్తుతం విశేషసేవలతో దేశ సౌభ్రాతత్వంను స్వేచ్ఛా స్వాతంత్రాలను, దేశసరిహద్దులను కాపాడుటలో నిరంతరం సేవలను అందిస్తున్న సైనికుల, వారి కుటుంబసభ్యుల, మాజీ సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందామన్నారు. త్రిసాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరివిరిగా విరాళాలు ఇచ్చి భారత సైన్యంలో మాతభూమికై విశిష్టసేవలను అందిస్తున్న వీరజవానుల త్యాగనిరతిని స్మరించుకొవాలని కలెక్టర్ మొదటి విరాళంను అందజేశారు. సైనిక సంక్షేమ పర్యావేక్షకులు రజాక్ ఖాన్, వెంకట ప్రమోద్ కన్నా, ఎన్.సి.సి కెడేట్స్, మాజీ సైనికుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎం.చంద్ర, సురేంద్ర బాబు, కార్యదర్శి మాజీ సైనికులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : జెసి

ఎస్‌హెచ్‌జి సభ్యులకు ఆటోలు పంపిణీ

మహిళలకు ఆటోలు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్థిక పరిపుష్టి సాదించేందుకు కషి చేయాలని జిల్లా జాయింట్‌కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం డిఆర్‌డిఏ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళా శక్తి (ఉన్నతి) పథకం ద్వారా 12మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు జెసి ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కంప్యూటర్ యుగంలో మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు మహిళా శక్తి (ఉన్నతి) పథకం ఒక వరం లాంటిదని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. నేడు మహిళలు డ్రైవర్లుగా రాణిస్తున్నారని, మహిళా శక్తి లబ్ధిదారులు తీసుకున్న ఆటోలను అమ్ముకోవడం ఇతరులకు లీజుకు ఇవ్వడం చేయరాదన్నారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్వయంగా ఆటో నడుపుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. మహిళా శక్తి ద్వారా ఆటోలు పొందిన లబ్ధిదారులకు జిల్లా అధికారయంత్రాంగపరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డిఆర్డిఏ పిడి తులసి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల్లోని అర్హత కలిగిన మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీలేని రుణాలతో ఈ ఆటోలను పంపిణీ చేస్తున్నామని, వీటిని చక్కగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో తొలి విడతలో ఎంపికైన లబ్ధిదారులకు విజయవాడలో ట్రాఫిక్ నిబంధనలతో పాటు డ్రైవింగ్‌లో ప్రత్యేకశిక్షణ ఇవ్వడం జరిగిందని, ఆటోలు పొందిన సంఘ సభ్యులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదుపరి అర్హత కలిగిన లబ్ధిదారులకు మహిళా శక్తి పథకం ద్వారా ఆటోలను అందిస్తామన్నారు. డిపిఎంలు వెంకటేష్, రవి, ఏపీఎంలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంస

ప్రజాశక్తి- నగరి: ఎస్జీఎఫ్ అండర్ 14 అంతర్‌జిల్లాల బాల్‌బాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ప్రశంసించారు. ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ బాల్‌బాడ్మింటన్‌లో అండర్ - 14 విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టు సభ్యులు గురువారం మంత్రి నివాసానికి వెళ్లి ఆమెను కలిశారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ బాబు, పీడీ గోపి, క్రీడాకారులు లక్ష్మీనారాయణ, ఎస్.రక్షణ్, కె.సిద్దిక్ పాల్గొన్నారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి: మంత్రి రోజా

భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి: సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి కరకంతాపురంలో గడపగడపకు నిధులు రూ.20లక్షల వ్యయంతో మూడు ప్రాంతాల్లో నిర్మించే సిమెంటు రోడ్లకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం.. అభివద్ధి సమపాళ్లలో జరుగుతోందన్నారు. గడపగడపకు పర్యటిస్తూ తెలుసుకున్న సమస్యలను గడపగడపకు నిధులు రూ.20లక్షల వ్యయంతో పరిష్కరిస్తున్నామని అన్నారు. కరకంతాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానిక ప్రజలు రోడ్డు సమస్యను తన దష్టికి తీసుకువచ్చారని దానిని నేడు పరిష్కరిస్తున్నామని అన్నారు. త్వరలో రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ కమిషనర్ కెవిఎన్ రెడ్డి, డీఈ నరేష్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు చినపాప, బీడీ భాస్కర్, భూపాలన్, యాకోబు, ఇంద్రయ్య, మురుగ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణ పై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఎక్కడా మాతాశిశు మరణాలు చోటు చేసుకోకుండా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవానలి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెలలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీకి 'స్క్రబ్ టైపస్' అనే వ్యాధి రావడంతో దానిని సరిగా గుర్తించక, చికిత్స తీసుకోకపోవడం వల్ల చనిపోవడం జరిగింది. ఇలాంటివి పునరావతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని, అంగన్‌వాడీ కార్యకర్తలతో ముఖాముఖిగా చర్చించి భవిష్యత్తులో శిశుమరణాలు, మాతశివు మరణాలు జరగకుండా నివారణ చర్యలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయిలోని హైరిస్క్ గర్భవతులకు అన్నీ పరీక్షలు నిర్వహించి ప్రణాళిక ద్వారా కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వారికి ఉచిత ఆర్థిక రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. మొదటిసారి గర్భం దాల్చిన గర్భవతులపై వైద్యాధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. బిడ్డబిడ్డకు కనీసం మూడు సంవత్సరాలు కాలవ్యవధి ఉండేలా గర్భవతులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి శిశు మరణాలను తగ్గించాలన్నారు.

'యుటిఎఫ్'ను బలోపేతం చేయాలి

మండల అధ్యక్షులు మొగిలయ్య

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: యుటిఎఫ్‌ను బలోపేతం చేయానికి మండలంలోని ఉపాధ్యాయులందరూ సహకరించాలని మండల అధ్యక్షులు మొగిలయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా సరిత, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా ధనంజయరాజులు ఎన్నికవ్వడం ఆనందించాల్సిన విషయమన్నారు. ఏన్నో ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఉద్యమాలు చేపడుతూ కీలకంగా ఉన్న యుటిఎఫ్‌ను బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యసేవలు

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీలోని పల్లికుప్పం, కావలి మడుగు గ్రామాలలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి పైగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పేదలఇళ్ల వద్దకే వచ్చి వైద్యం అందించటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వైద్యసిబ్బంది డాక్టర్ మధు, ఝాన్సీరాణి, పార్థసారథి, టీడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు విశ్వనాధ్, మాజీ విఎస్ఎస్ ఛైర్మన్ నారాయణ స్వామి, మాజీ వైస్‌సర్పంచ్ పిటి అప్పాల, నవీన్, ఐటిడిపి ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఓటు వేయండి: ఎంఎల్ఎ

కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం మరో మారు జగన్‌మోహ్మన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని చిత్తూరు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని 35,36వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాక్రమాలను ప్రజలకు వివరించారు. నాయకులు జ్ఞానజగదీష్, కోలా కిరణ్, అలి, పూర్ణ, నాయకులు, పాల్గొన్నారు.

11న జిల్లా స్థాయి సంగీత, నాటక పోటీలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు 11న ఒక్క రోజు మాత్రమే నిర్వహించ నున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ప్రతిభగల విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 9,10,11,12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. మొత్తం 10 కళారూపాల్లో పోటీలు ఉంటుందని పేర్కొన్నరు. నాట్యం (సాంప్రదాయ, జానపద) గాత్ర, సంగీత, (వర్కసీన్, విభాగాల్లోను మెలోడీ), ద్విమితీయ, తిమితీయ చిత్రణ, సాంప్రదాయబద్ధ ఆట బొమ్మలు, ఆటలు, నాటకం (ఏకపాత్రాభినయం) విభాగాల్లోనూ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక విద్యా సంస్థ నుండి ఒక్కొక కళారూపంలో ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే విడివిడిగా పాల్గొనాలన్నారు. గత సంవత్సరం 2022లో జరిగిన కళాఉత్సవ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలు ఈ ఏడాధి పోటీల్లో పాల్గొనడానికి అనర్హులన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కళారూపానికి సంబందించిన అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి కళా రూపానికి 5నిమషాలు సమయం ఇవ్వబడునని ఆసక్తి కలిగినవారు డైట్ అధ్యాపకురాలు పీ.నిర్మల 99858 97519. సునీత 94926 53001, పీఎస్ అనిత 77802 29110 నంబర్లకు ఫోన్ లేదా వాట్సప్ ద్వారా సంప్రదించి వివరాలను తెలుసుకోవచ్చున్నారు. పోటీదారులు 11వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు డైట్‌కు చేరుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేరకు గురువారం చిత్తూరు ఎమ్మార్వో తహాశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల నాయకులు హబీబుల్లా గోవర్ధన్, గిరిధర్, చంద్రశేఖర్ నిరసన దీక్ష చేపట్టారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారస్తులు, కూలి పనిచేసే ప్రజలు వారి కుటుంబం భవిష్యత్తు అవసరాల కోసం అగ్రిగోల్డ్ సంస్థలో వారి స్తోమత మేరకు పొదుపు చేసుకున్నారని గుర్తుచేశారు. కొన్ని సంవత్సరాలు తర్వాత అగ్రిగోల్డ్ సంస్థ కస్టమర్లను, ఏజెంట్లను మోసం చేసి ఇబ్బందులకు చేసిందని, ఈ సంస్థను నమ్మి డబ్బు పోగొట్టుకున్న కస్టమర్లకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా శ్రీవెంకటేశ్వర స్వామివారి కళ్యాణం

ప్రజాశక్తి- సోమల: మండలం నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లి గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సప్తమ వార్షిక కళ్యాణోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగింది. మొదటిరోజు మూలవిగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి మధ్యాహ్నం సాయంత్రం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే స్వామివారి కీర్తనల ఆలాపన అనంతరం హరికథా కాలక్షేపాలను నిర్వాహకులు చేపట్టారు. రెండవ రోజు గురువారం ఉదయం మూల విగ్రహానికి ప్రత్యేకపూజలు అభిషేకం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. కళ్యాణం ఉత్సవానికి గ్రామస్తులే కాకుండా కందూరు సోమల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం సందర్భంగా పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

యువత ఉపాధి కల్పనకు కృషి :అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మాత్రమేనని మాజీ మంత్రి ఎన్.అమర్నాథరెడ్డి అన్నారు. మండలంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుర్లపల్లి పంచాయతీలోని గుమ్మరాజుపల్లి, కొత్తూరు, తుర్లపల్లి, నగిరేపల్లి, కొలతూరు పంచాయతీలోని చదళ్ళవారిపల్లి, ఉపొద్దురు, కొలతూరు, గుండ్లపల్లి, పాలేపల్లి, గల్లవారిపల్లి, మద్దలకుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుర్లపల్లి, కొలతూరులో పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు బాలాజీ, గణేష్, వెంకటరెడ్డి, రాజారెడ్డి, కష్ణారెడ్డి, మణి, ఎండీ.బాష, పగడాల ప్రవీణ్, రోజారెడ్డి, రాజారెడ్డి, నారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అభద్రత వీడి అభివృద్ధి వైపు అడుగులు వేయండి

ఎంఈవో ఆంజనేయులు శెట్టి

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వైకల్యం శరీరానికి కానీ మనసుకు కాదని అభద్రతా భావాన్ని వీడి అభివద్ధి వైపు అడుగులు వేయాలని మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులశెట్టి పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అధ్యక్షతన భవితా కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో సజనాత్మకతకు కొరతలేదని, సాధారణ విద్యార్థుల కన్నా అధిక ప్రతిభా, పాఠవాలు ఉన్నాయని, ప్రోత్సహిస్తే అన్ని రంగాలలో రాణించగలరన్నారు. దివ్యాంగుల కొరకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు భవితాకేంద్రంలో ఇస్తున్న సేవలను ఉపయోగించుకొని వారి బంగారు భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా భవితా కేంద్రంకు విద్యార్థులను పంపి అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. అలాగే చరణ్, లావణ్య, తాజ్ భాయ్‌లకు ప్రభుత్వా అందించిన ట్యాబ్లు అందజేశారు. విశ్రాంతి ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, పద్మావతి భవితా కేంద్రంకు గోడ గడియారం వితరణ చేశారు. కార్యక్రమంలో అక్కన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.గంగాధరం, జీడీ నెల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డమ్మ, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నిరంజన్. సహిత విద్య సమన్వయకర్తలు వరదారెడ్డి, పుష్పావతి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్..?

నూతన సచివాలయం ప్రారంభం
రికార్డుల భద్రత కోసమే అంటున్న ఎంపిడిఓ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామ సచివాలయాన్ని నూతనంగా నిర్మించారు. అయితే ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. ఈ స్థలానికి సంబంధించి న్యాయస్థానంలో కేసు ఉండటం ప్రారంభం కాలేదని స్థానికులు చెబుతున్నారు. అయితే గురువారం సచివాలయ సిబ్బంది గుట్టచప్పడు కాకుండా నూతన కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఎంపిడిఓకి సన్మానం కూడా చేశారు. న్యాయస్థానంలో కేసు జరుగుతున్న సచివాలయాన్ని మండల, జిల్లా స్థాయి అధికారులకు తెలియకుండా, కోర్టు ఆదేశాలను పాటించకుండా ప్రారంభించారని విమర్శలు వినిపిస్తున్నాయి.

రికార్డుల భద్రత కోసమే మార్చాం
ఎంపిడిఓ ప్రేమ్‌దాస్ కుమార్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సచివాలయ భవనంలోనూ ఉరుస్తోంది. దీని కారణంగా రికార్డులు ఎక్కడ పాడైపోతాయో అని రికార్డుల భద్రత కోసమే నూతన సచివాలయంలోకి మార్చడం జరిగింది. అధికారికంగా విచారణ చేపట్టాం, న్యాయపరమైన సమస్యలు లేవు సమగ్రంగా తెలుసుకుంటాం.

సచివాలయ భవనాలపై గడ్డి

మండలంలోని జక్కిదొనన సచివాలయ భవనంపై గడి ఏపుగా పెరుగుతోంది. వర్షాలకు నాచు పేరుకుపోయి భవనంపై గడి పెరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ చిత్రం అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా చెప్పవచ్చు.

ప్రతి విద్యార్థి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

ప్రజాశక్తి - కార్వేటినగరం : ప్రతి విద్యార్థి జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండలంలోని 80 పాఠశాలలకు క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ జాతీయ క్రీడాకారులు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకే ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు క్రీడా సామగ్రిని అందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవొ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని చెప్పారు. పాఠశాలల్లో విధులు నిర్వహించే వ్యాయామ ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని పిల్లల్లో దాగి ఉన్న క్రీడలను వెలికి తీయాలని సూచించారు. అలాగే పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేందుకు మండలంలోని అన్ని పాఠశాలకు పెనాయిల్, రూమ్ స్ప్రేతో పాటు బ్యాషన్, ఫ్లోర్ క్లీనర్ వంటి అధునాతనమైన పరికరాలకు ఉపాధ్యాయులకు అందించారు. ఈ క్రమంలో భాగంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ మురళీ, సర్పంచ్ఏ ధనంజయవర్మ, ఏఈ నాగభూషణం, హెచ్ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

వ్యాధులు ప్రభలకుండా అరికట్టాలి

జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- నగరి: తుపాన్ కారణంగా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించడం, కాలువల్లో నీరు పొంగిపొర్లడం లాంటివి జరిగాయని దీంతో కీటకాలు వ్యాప్తిచెందేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యసిబ్బంది వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిజిల్లా మలేరియా అధికారి ఎల్.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని ఎస్.బుగ్గ అగ్రహారం మున్సిపల్ పరిధి పుదుపేట నార్త్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో ఉన్న ల్యాబ్‌లను క్షుణంగా పరిశీలించి.. టెక్నీషియన్లకు తగిన సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధివ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమకాటు వలన వచ్చే జ్వరాలైన డెంగీ, చికెన్ గున్యా, మలేరియా మొదలగు వ్యాధుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వలలో లార్వాలు పెరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వర పీడితులకు రాపిడ్ కిట్ ద్వారా గాని, స్లైడ్ ద్వారా గాని వ్యాధి నిర్ధారణ చేసి ట్రీట్మెంట్ ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లో తనిఖీలు చేపట్టి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచేలా చేయాలన్నారు. ఫ్రైడే డ్రైడే పక్కా జరిగే విధంగా చూడాలన్నారు. ఏఎన్ఎంలకు ఇచ్చిన వెక్టార్ హైజీన్ యాప్‌ను అప్డేట్ చేయించే విధంగా వారికి తోడ్పాటు అందించాలన్నారు. డిప్యూటీ డీఈఎంవో జయరామయ్య మాట్లాడుతూ గర్భకాలంలో లింగనిర్ధారణ పరీక్షలు చేసిన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌వి లు పాల్గొన్నారు.

అన్నదానికి రూ.50వేల విరాళం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక 39వ డివిజన్ డిఐ రోడ్డు ఎంబి కాంప్లెక్స్ వద్ద ఈనెల 20వ తేదీ నిర్వహించనున్న అయ్యప్ప భక్తుల అన్నదాన కార్యక్రమానికి జిజేఎం చారిటుబల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్ మోహన్ నాయుడు గురువారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జిజేఎం కార్యాయంలో రూ. 50 వేలు విరాళంగా అందించారు.

'చంద్ర బాబుతోనే భవిష్యత్తు..'

ప్రజాశక్తి- రామకుప్పం: మండలపరిధిలోని 90 బందాలపల్లి పంచాయతీలో గురువారం 'బాబు షూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని టీడీపీ నేతలు విస్తతంగా చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గతంలో చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం తిరిగి అభివద్ధి బాటలో పయనించాలంటే టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని, చంద్రబాబు నాయుడును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ రఫీ, మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, మురళీమోహన్, గడ్డురు సతీష్, చంద్ర, రమేష్, మాజీ సర్పంచ్ పెరుమాల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తహాశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలం తహాశీల్దార్ జయంతి కుమార్‌ని ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. మండల పరిస్థితిలను వివరించారు. సమస్యలతో తమశీల్దార్ కార్యాలయంకు వచ్చే ప్రతి రైతుకు, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

రక్తదానం అందరి బాధ్యత

ప్రజాశక్తి- కార్వేటినగరం: రక్తదానం అనేది మనందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజియులురెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రెడ్డిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని తెలియజేశారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు, అలాగే ఆపోహలను స్విమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్చార్జి డాక్టర్ సురేష్ క్షుణ్ణంగా వివరించారు. ప్రతి ఏడాది రక్తం ఇవ్వడం వల్ల ఆ వ్యక్తి ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటారని గుర్తుచేశారు. రక్తదానానికి 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి కళాశాల అధ్యాపకులు సర్టిఫికేట్లను అందించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, ఆధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, సుబ్బారావు, డాక్టర్ బాబు, ఎస్.కార్తీక్, శివరామకష్ణ, విశ్వనాధరెడ్డి, లావణ్య, ప్రసాద్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బర్నింగ్ మిషన్ వితరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక కైలసపురం వద్ద ఆర్యవైశ్యులు, లయన్స్ గోల్డ్ వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కైలాస ధామం స్మశాన వాటికకు సామగ్రి వితరణ చేయమని చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీని కోరారు. ఆర్యవైశ్యులు, లయన్స్ గోల్డ్ కోరిక మేరకు చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు జిజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురుజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో స్మశాన వాటికకు రూ.40లక్షల విలువచేసే అత్యాధునిక ఎలక్ట్రికల్ అథారిటీ బర్నింగ్ మిషన్ వితరణగా ఇవ్వనున్నారు. శుక్రవారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఎలక్ట్రికల్ అథారిటీ బర్నింగ్ మిషన్‌ను కైలాసధామం స్మశాన వాటికకుల ఇవ్వనున్నట్లు జిజేఎం ట్రస్ట్, తెలుగుదేశం నగర అధ్యక్షులు కఠారి హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా గణేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాంగ్రెస్ పార్టీ చిత్తూరు రూరల్ మండలాధ్యక్షులుగా సి.గణేష్ నియమితులయ్యారు. చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ్ టిక్కి రాయల్, పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు చిత్తూరు రూరల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందని గణేష్ తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకుల ఆదేశాల మేరకు పార్టీ అభివద్ధికి కషి చేస్తానని తెలిపారు.

క్రైం న్యూస్

మహిళ హత్యకేసులో

ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తాళికట్టిన భార్యను హత్యచేసిన కేసులో ముద్దాయి జగదీశ్వర్‌రెడ్డి (40)కి జీవితఖైదు విధిస్తూ 6వ అడిషనల్ జడ్జి తీర్పునిచ్చారు. వివరాల మేరకు 2020 మే 25వ తేదీ ఐరాల మండలం అగ్రహారం గ్రామంలో జగదీశ్వర్‌రెడ్డి తన భార్య సుష్మితను తమ నివాసంలో రాత్రి సమయంలో గొంతుకోసి హత్య చేశాడు. మృతురాలు సుష్మిత (34) కుమార్తె తన తల్లిని తండ్రే గొంతుకోసి హత్యచేశాడంటూ ఐరాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఐరాల పోలీసులు అప్పటి చిత్తూరు వెస్ట్ సిఐ లక్ష్మీకాంత్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. హత్య జరిగిన మరుసరి రోజు ముద్దాయిని వైఎస్ గేటు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాదాపు మూడేళ్లపాటు విచారించిన కోర్టు ముద్దాయి జగధీశ్వర్‌రెడ్డిపై నేరం నిరూపనకావడంతో జీవిత ఖైదు విధిస్తూ 6వ అదనపు జడ్జి తీర్పును వెలువరించారు.

హత్య కేసులో జీవితఖైదు పడ్డ ముద్దాయి జగదీశ్వర్‌రెడ్డి

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం తహశీల్దార్ కార్యాలయంలో చిలమాకులపల్లి గ్రామరెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న బొంతమ్మ (55) అనారోగ్యంతో గురువారం మతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారి బెన్నురాజు, డిప్యూటీ తహశీల్దారు లోకనాథ పిళ్లై, రెవెన్యూ సిబ్బంది బొంతమ్మ స్వగ్రామం చిలమాకులపల్లికి వెళ్లి ఆమె మతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి దహన క్రియలు గాను రెవెన్యూ కార్యాలయం సంబంధించి రూ.15 వేలను అందించారు. వీరి వెంట ఆర్ఐ ప్రభాకర్ వీఆర్ఏలు కనకరాజు, శేఖర్, విఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీపడాలి

ప్రజాశక్తి- పెద్దపంజాణి

విద్యార్థి దశ నుంచే విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొని పోటీ పడాలని మదర్ తెరిసా విద్యాసంస్థల చైర్మన్ ఎం.రవీంద్రబాబు అన్నారు. మదనపల్లి బీటీ కళాశాలలో జరిగిన మహాకార్య సంగీత పోటీలలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ పోటీ ప్రపంచాన్ని తట్టుకొని మానసిక ఎదుగుదలకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. మదర్‌థెరిసా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లు ఆయన తెలిపారు. వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు దాదాపు 170మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో మదర్ థెరీసా పాఠశాల తరపున 1 నుండి 9 తరగతుల బాలబాలికలు 27 మంది పాల్గొని తమ గాత్రంతో జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలలో మొదటి బహుమతులు 5, రెండవ బహుమతులు 6, మూడవ బహుమతులు 5 పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ డాక్టర్ ఎం.రవీంద్ర బాబు, ప్రిన్సిపల్ డేవిడ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చేతి వృత్తిదారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి- కుప్పం: పట్టణంలో కుమ్మరి కులస్తులకు శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనియర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ తరపున గుర్తింపు కార్డులను అందజేశారు. అలాగే చేతి పనులను ప్రోత్సహిస్తూ స్థానికంగా శిక్షణ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేతి వత్తులను ప్రోత్సహించి యువతను స్వయం ఉపాధి వైపు నడిపించే క్రమంలో కుప్పం పట్టణంలో శాలివాహనుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు ఉపయోగించుకుని యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఆకాంక్షించారు. శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ మూర్తి, జిల్లా డిఆర్డిఓ కష్ణమూర్తి, పలమనేరు రామకష్ణ, మురుగన్ వుదయార్, సామరాజు వుదయార్ పాల్గొన్నారు.

టిటిడి సహకారంతో...

శెట్టిపల్లి రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దశాబ్దాల కల నిజం కాబోతోంది.. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మంగళం పరిసర కాలనీలకు అనువుగా ఉండేలా శెట్టిపల్లి మార్గాన్ని పునరుద్ధరించి 80 అడుగుల రోడ్డు వేసేందుకు ఇటీవల జరిగిన టిటిడి పాలక మండలిలో తీర్మానం చేశారు. శెట్టిపల్లి మార్గాన్ని విస్తరించేందుకు 15.12 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. మంగళం ఆర్‌టీఓ కార్యాలయ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వేగేటు వరకు, నారాయణాద్రి హాస్పిటల్ పక్కనున్న మార్గం నుండి జాతీయ రహదారిని కలుపుతూ 2.90 కి.మీ నూతన రోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో తిరుపతికి వచ్చే యాత్రికులకు సౌకర్యంతో పాటుగా నగర వాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ఇది వరకే స్పష్టం చేశారు. ఈ పనులను ప్రారంభించేందుకు గురువారం కాంట్రాక్టర్ గ్యారసన్‌వైఎస్ఎన్(జెవి) కన్‌స్ట్రక్షన్స్ అధినేత వై.రమేష్ నాయుడు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడానికి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. మార్కింగ్ చేస్తూ స్థానికంగా శెట్టిపల్లి మార్గ బౌగోళిక పరిస్థితిని పరిశీలించారు. శెట్టిపల్లి మార్గాన్ని నాణ్యతగా నిర్మిస్తానని రమేష్ నాయుడు చెప్పారు.

శెట్టిపల్లి మార్గం.....

శెట్టిపల్లి మార్గం రేణిగుంట రోడ్డు మార్గం నుండి మంగళం జిల్లా రవాణాశాఖ కార్యాలయ కూడలిని కలుపుతుంది. చిన్నపాటి ఉద్యోగులు, గృహ నిర్మాణం కోసం ఇసుక, గులక వంటి వాటి రవాణా కోసం ఎక్కువగా ఈ మార్గాన్ని వినియోగిస్తారు. మరోవైపు నేరాలకు అడ్డాగానూ గతంలో ఉండేది. ఈ మార్గంలో వీధీలైట్లు ఉండవు. ఇదే అదునుగా గతంలో ఎక్కడో హత్యచేసి ఈ మార్గంలోని కల్వర్టుల్లో తోసేసి వెళ్ళిపోయేవారు అగంతకులు. అసౌకర్యంగా ఉన్న ఈ మార్గాన్ని ప్రస్తుతం 80 అడుగుల వెడల్పాటి మార్గంగా మార్చుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల కలకు శ్రీకారం

రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి :

ప్రళయకావేరి నారాయణరెడ్డి, వైసిపి

శెట్టిపల్లి మార్గం 80 అడుగుల విస్తరణ చేసి అందుబాటులోకి తీసుకొస్తే ఈ మార్గంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. చాలా కాలంగా శెట్టిపల్లి మార్గానికి పంచాయతీ నిధులను ఉపయోగించి గ్రావెల్ రోడ్డును వేస్తూవచ్చాం. ఇప్పుడు టీటీడి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి భక్తులకు, స్థానికులకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో ఎన్నడూ లేని విదంగా మంగళం ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను చేసాం.

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటి సిఎం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరులో మహి మై చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అధ్యక్షులు మహి మైదాస్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 500మంది మహిళలకు చీరలు, 100 మంది పిల్లలకు దుస్తులు, 150 మంది పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తమిళ సినీ నటుడు సెంథిల్ కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్లు వైఎస్ఎంపీపీ హరిబాబు, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో 'క్లీన్ అండ్ గ్రీన్'

ప్రజాశక్తి- గుడిపల్లి

ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య యశోద ఆధ్వర్యంలో గురువారం ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ బాటిల్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆచార్య యశోద మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన దోమల బెడద ఉండదని తెలిపారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జి.శైలమ్మ మేరా భారత్ ఆన్‌లైన్ పోర్టల్ రిజిస్టరు చేసుకోవాలని తెలియజేశారు. పరిసరాలను శుభ్రం చేసిన విద్యార్థులను ఆచార్య డి.భారతి, రెక్టారు ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రారు ఆచార్య ఏకే వేణుగోపాలరెడ్డి అభినందించారు.